# లేని చిక్కు

రచన :
" మహబుబ్ "

"ఓరె నీ తాడుతెగ! రతీలాటి పెళ్ళాన్నుంచుకొని, ఆ దొమ్మరగుడిసెల్లో ఏంపనిరా బాడ్‌కోవ్‌పని! ఆ పాడు ముండలదగ్గర ఫల్‌టీలుకొట్టుంటావా? రాత్రంతా అక్కన్నే వుంటే పెళ్ళాంగతేం? పిల్లాజల్లాలేంది అదెల్లా ఒంటరిగా వుంటుంది?"

" ఎవరే చెప్పింది నీకు? అది చెప్పిందా? అదెప్పుడూ నామీదనే ఆడిపోసుకుంటూంటుంది. రాత్రి ఒకగంట ఆగు పించకపోతే యిదే రామాయణం."

" చాల్లేరా నీ పిండాకూడు! మరో ఆడదైందంటే పొరకతీసుకొని పూజించేది. నీకేం పనిరా గుడిసెల్లో? గోరో జనంలేని ఆ పిల్లల్ను రాసుకొని తిరక్కపోతే మెతుకులు మింగలేవా? రాక రాక అక్క వచ్చిందని ఒకగంటసేపైనా మాటాడావా? మూన్నాళ్ళనుండీ చూస్తున్నా నీ నాటకం! నువ్వింతో యిదిగా వున్నావని నేనందర్తో చెప్పుకునేది! నిజానికి నీఖర్మ యీలాగుండేది ఎవర్కి తెలుసు? పాలంపుట్రా వుందా? ఊడిందా? దాన్నేం సాకుతావ్? పుట్టింటికి తోలేసిరా. ఆ దొమ్మరదాన్నే తెచ్చుకొని ఫ్రోలువాయిస్తూందువూ."

" లేదక్కా! నాకేదీ తెలీదు. వచ్చే ఎలక్షన్‌కు నిలబడాలని ప్రచారం చేస్తూన్నా. అదీ రాత్రి పూట జనం యింట్లోవుంటారని పోతూంటా."


" ఎలక్షనూ—నీదుంప. ఆ టోపీ, ఆ జుబ్బా నీకు లాయగ్గా వుందట్రా? పులితోలు కప్పుకున్న పశువుగాదట్రా నువ్వు? ఆపిల్ల మళ్లీ అఘోరిస్తూంది. రెండేళ్ళు ఏదో సాకుపెట్టి విడిచేస్తివి. మళ్లీ ఆరంభించావు నీఆటలు? అదేం బతకాల్నా? చావాల్నా?"

"పోనీలే నీమాటలు! దానిమాటలునమ్మితే అంతే."

" నీ యింట్లో అరనిముషంకూడా ఉండను. సాయంత్రమే బస్సుయెక్కిస్తే వెళ్లిపోతా."

" నీ యిష్టం."

మాధవస్వామి అక్కకు ఎక్కడలేని కోపంవచ్చింది. అతను చేసేదికూడా అన్యాయంకాదూ? తిరుమలకు పెళ్లా



యి నాలుగేళ్ళయినా అతనిదగ్గర కాపురంచేసింది ఏ అయిదారునెల్లో. పెళ్ళాంమీద లేందేదో కల్పించి రెండేళ్ళు తోలేశాడు. మాట వచ్చిందంటే మూన్నెళ్ళు పుట్టింటికి తరిమేస్తాడు. భర్తంటే భగవంతునితో సమానం అనుకునేది కాబట్టి సరిపోయింది. లేకుంటే భర్తను పక్షింద్రుడులాగా తల్చుకునేది అయివుంటే యింతవరకూ బాగుగానే వుండేది.

బస్సు కాస్త పోయాక చెడిపోయిందని మాధవుని అక్క మళ్ళీ ఇంటికి వచ్చింది. ఇది అతనికి తెలీదు. అక్క వెళ్ళిపోయింది ఇక జల్సాగా వుండొచ్చని ఆరాత్రే అబేస్ అయ్యాడు గుడిసెల్లోకి. తిరుమల యిదంతా చెప్పింది అవి

డశో. వాళ్ళిద్దరు ఒకనాటకం ఆడిచూపించాలనుకున్నారు. తెల్లారితే ఆరుగంటలకుకానీ అతను యింటికిరాడు.

తెల్లవాఱింది. అయిదూ అయిదున్నర అయింది. వారుండేది అక్కయ్యాసందులో ఆరోయింట్లో. అతనుయింట్లో లేకపోతే ఆ రూం కిటికి మూసేవుంటుంది. ఆ రోజు అది తెరిచేవుంది. మాధవుడు ఏమిట్రా అని ఆలోచిస్తూ దగ్గర కొచ్చి కిటికీలోనుండి తొంగిచూసాడు. ఏముంది? కొంప మునిగింది. తనపెళ్ళామే! అబ్బోయ్ అతనెవరో? అది నిలబడుంది. అతను రాత్రంతా సరసాలాడి పోతూపోతూ గుడ్ బై చెప్తూన్నాడు ముద్దుతో. ఒరే నీ దుంపతేగా! వీనికి ఒక ఖద్దరు టోపీకూడానా? మాధవుని వల్లు మండి పోయింది. కల్లు కనపడలేదు. తలుపు ఒక్కసారి బాదాడు. రెండో క్షణంలో తిరుమల తలుపు తీసింది. ఆ రూం దగ్గర్కి పరుగెత్తాడు. ఏముంది? మూసుకునేవుంది. తెరచేదెవరు? దానివెండ్రుకలు పట్టుకొని "చెప్పు ఎవరున్నారో లోపల. నరికేస్తా!"

"నాకేం తెలీదు" అంది తిరుమల.

"ఎంత పనితనంవుందే. ఏకులాగుండి మేకుల్ను తింటున్నావ్. చెప్తావా లేదా? ఎవరా గాడిదకొడుకు?"

"నాకొక్కటీ తెలీదు." అని యేడ్చింది.

ఏడ్చేదాన్ని యింకా నాలుగు ఖర్చుకిచ్చాడు. వాండ్లూ—వీండ్లూ—అమ్మలు—అక్కలు పదిమంది జతయ్యారు తెల్లారి యీ గోష్టి యేమిట్రా అని. ఆ తలుపులు పగులగొట్టేనే కాని నిజం తెలీదంటాడు. ఆ కిటికీ కూడా మూసారు చూడంటాడు.

దభీలున తలుపు తెరవబడింది. ఖద్దరు టోపీతో కూడా ప్రత్యక్షమయ్యాడు ఒకాయన.

"నువ్వా అక్కా" అన్నాడు

"అందరూ నవ్వుతూ బయటికెళ్ళారు. తిరుమల అంది "మీకు పగలు—ఆయనకు రాత్రి సేవచేస్తా"

మాధవుడు తల వంచుకున్నాడు.

"ఒరేయ్ శనీ! నువ్వేరా నువ్వే! ఏ మెరుగనని కూసావే? రాత్రంతా ఎక్కడికెళ్ళావు? ఆడదానికి కడుపు నిండ అన్నం—వయినిండ బట్ట—వుంటే చాలుతుందనా మూడు ముళ్ళూవేసి పట్టుకొచ్చావ్? నువ్వంటే రాత్రంతా గడ్డితినడానికెళ్ళావు. అది యెక్కడి కెళ్ళాలి? దానికి యేదైన మార్గం చూపించరాదూ?

మాధవుడు తలవంచుకొని రూంలో కెళ్ళాడు.

రెండోరోజు రాత్రి "ఏమండీ! తొందరగా వెళ్లండి ఆయనగా రొస్తారేమొ" అంది తిరుమల.

మాధవుడు తిరుమల కళ్లల్లోకి నవ్వాడు.


శ్రీ
జీవా

[స్టమక్ పవ్వుడర్ అపరేషన్ అవసరంలేకుండా చికిత్స]

సకలవిధములగు కడుపునొప్పులున్ను Appendicitis అను కడుపునందు ఏర్పడు వ్యాధినిన్ని కడుపునందు గలుగు



రణములు, గడ్డలు మొదలగు వాటిని కడుపును ఆపరేషను చేయకనే ఈ ఔషధము పుత్తరవాదముతో గుణపరుచును. ఈ ఔషధమును మలయాళ అష్టాంగ హృదయము ననుసరించి మిక్కిలి ప్రయాసపడి తయారు చేయబడినది. ఈ ఔషధము అల్సర్, మలబంధం, పుల్లతేనుపు, పేగుల ద్వారాకలుగు అనేకవ్యాధులు, గుల్మం, భోజనమునకు మునుపో లేక తరువాతనో గలుగు కడుపునొప్పి మొదలగు అనేక సంకటములను ఖండితముగా గుణపరుచును. దీనివిషయమై విశేషముగా చెప్పనేల ఒకతూరి తెప్పించి భుజించిన యదార్థము తెలియును. సుఖపడవచ్చును.

30 దినముల 60 పూటలమందు క్రియం 2—8—0

ధనలక్ష్మి అండు కంపెని,

నెం. 6, లాయర్ చిన్నతంబి మొదలి వీధి, మద్రాసు.



యువదంపతులకు వెలువడినది 50 గ్రంథముల శృంగార మార్గము త్వరపడుడు సారాంశము

# సతీపతికుతూహల రహస్యములు.

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి రసాస్వాదనము చేయుటయే గాక కామశాస్త్రమును తప్పక పఠించేవారు. రాణివాస మందలి కాంతలుకూడా దీనిని నేర్పడివారని వాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడీ కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారి యపరాధము కాదు. తగిన గ్రంథము లేక పోవుటే దీనికి ప్రధానకారణము. నేడీ కొరతతీరినది. సతీపతి కుతూహల రహస్యములను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామ కళా గ్రంథములతో నిండి కళాసంబంధమగు పూర్ణ జ్ఞానమును కలిగించుచున్నది. ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది. గ్రంథము వెల రూ. 2—8—0. పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,
సౌకార్ పేట, మద్రాసు.